

ఇన్‌ఛార్జ్ ఇఒగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇఒగా డిప్యూటీ కమిషనర్ డిఎం. రమేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఇఒ రామచంద్ర మోహన్ వ్యక్తిగత కారణాలతో కొద్ది రోజులు సెలవు పెట్టారు. దీంతో రోజువారి పరిపాలనకు ఎటువంటి ఆటంకం లేకుండా దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలతో రమేష్ బాబును ఇన్‌ఛార్జ్ ఇఒగా నియమించారు. దీంతో ఆయన ఇఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ ఇఒగా బాధ్యతలు స్వీకరించారు.



ఇన్‌ఛార్జ్ ఇఒగా బాధ్యతలు చేపట్టిన డిసి

ఉపాధి కూలీల వేతన వెతలు

- 10 వారాలుగా అందని కూలి
- రూ. 70 కోట్లకు పైగా పెండింగ్
- విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- పస్తులతో గడుపుతున్న కూలీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కిర్లంపూడి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, ఇతర కూలీల జీవనోపాధికి ఉపాధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. వారి కుటుంబ పోషణ దీని ద్వారానే సాగుతోంది. అయితే అధికారులు పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయకపోవడం వలన అక్కరకు రాకుండా పోతోంది. పనులు చెప్పకపోవడంతో ప్రస్తుతం అరకొర మంది మాత్రమే పనుల్లోకి వెళుతుండగా పెండింగ్ వేతనాలు భారీగా పేరుకుపోయాయి. సుమారు 10 వారాలుగా కూలీ డబ్బులు అందని పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కూలీల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లనే సకాలంలో వేతనాలు అందడం లేదు. దాంతో పస్తులతో కాలం గడుపుతున్న పరిస్థితి ఏర్పడింది.

కిర్లంపూడి మండలంలో 2024 - 25 ఏడాదికి 13,828 జాబ్‌కార్డులను మంజూరు చేశారు. 21,694 మంది కూలీలు ఉన్నారు. 10,722 జాబ్ కార్డుదారుల ద్వారా 15,055 మంది కూలీలు పనిచేశారు. మొత్తం 2,07,756 పని దినాలను కల్పించారు. 41 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని కల్పించారు. ఏప్రిల్ నెలలో కొన్ని రోజుల మినహా ఇప్పటి వరకు వేతనాలను విడుదల చేయలేదు. దాదాపు రూ.3కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఇలా ఒక్కొక్క మండలంలో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోయాయి.

రూ.79 కోట్లు పెండింగ్

కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామపంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డుల పరిధిలో 4.48 లక్షల మంది కూలీలున్నారు. వీరిలో రెగ్యులర్‌గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నందున నెల రోజుల నుంచి 8 వేలు నుంచి 15 వేల మంది మాత్రమే పని చేస్తున్నారు. మే నెల 20 నుంచి వేతనాలు అందడం లేదు. ఇలా ఒక్కొక్కరికి 10 వారాలుగా వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక కూలీ 6 రోజులూ పనికి వెళితే రోజుకి రూ.270-రూ.280 చొప్పున వారానికి రూ.1,680 నుంచి రూ.1,742 వరకూ కూలి వస్తుంది. ఇలా జిల్లాలో ఒక్కొక్కరికి రూ.12 వేలు నుంచి రూ.15 వేలు వరకూ వేతనాలు అందాల్సి ఉంది. ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజనే అయినా కూలీలకు ఉపాధి లభించని పరిస్థితి నెలకొంది. జిల్లా మొత్తంగా రూ.70 కోట్లు పైనే వేతనాలు పెండింగ్లో ఉన్నాయని జిల్లా ద్వామా అధికారులు తెలిపారు. వ్యవసాయ పనులు నామమాత్రంగానే సాగుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో వందలాది మంది కూలీలు ఉపాధి హామీ పనుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సీజన్ కావడంతోనే కూలీలు పనులకు తక్కువగా వస్తున్నారని అధికారులు చెప్పుకొస్తున్నారు. వాస్తవానికి వారాల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండడంతోనే పనులకు వెళ్లేందుకు కూలీలు వెనకడుగు వేస్తున్నారు. కూలీల కష్టార్జితానికి ఫలితం ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకుంది. దీంతో కూలి డబ్బులు రాక కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం



60 ఏళ్ల వయసులో ఉపాధి పనులకు వెళుతున్నాను. బకాయిలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ కోసం వేతనాలు వచ్చాక చెల్లిస్తామని అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే విడుదల చేయాలి.

-పుప్పాల సుబ్బారావు, ఉపాధి కూలీ, బోయినపూడి, సామర్లకోట మండలం

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం చాలా ఉపయోగపడుతుంది. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది. గతంలో అడిగిన వారందరికీ పని కల్పించేవారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో పనులు కల్పించలేకపోతున్నారు.

-దుక్కిపాటి శ్రీను, వ్యవసాయ కార్మికుడు, కొత్తలంక, తాళ్లరేవు మండలం

బకాయిలు ఇప్పించండి మహాప్రభో...



సంవత్సర మొత్తంలో 100 రోజుల పనిని ఎలాగూ కల్పించట్లేదు. కనసీ పని చేసిన రోజులకూ వేతనాలు ఇవ్వట్లేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించాలి. వేతనాలు విడుదల చేయాలి.

- ఆళ్ల వీరబాబు, ఉపాధి కూలీ, జగపతినగరం, కిర్లంపూడి మండలం



యు.కొత్తపల్లిలో చేనేత చీరల కోసం కలెక్టర్‌కు వివరిస్తున్న జౌళి శాఖ అధికారులు

చేనేత కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి, పెద్దాపురం, ఏలేశ్వరం

చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉప్పాడ-కొత్తపల్లి సురక్ష కమ్యూనిటీ హాలులో జిల్లాస్థాయి చేనేత దినోత్సవం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి చేనేత రంగంలో ఉప్పాడ చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా చేనేత రంగంపై ఆధారపడి చేనేత రంగం అభివృద్ధికి తోడ్పాటున అందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నూరు శాతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగంపైనే అధిక శాతం ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎస్.వర్మ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపై చేనేత కార్మికులు అవగాహన పెంపొందించు కోవాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత రంగాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.పెద్దిరాజు, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మహారాణి కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయ్ అధ్యక్షతన జాతీయ చేనేత దినోత్సవంలో చరిత్ర అధ్యాపకులు వి.అచ్చిరెడ్డి, ఫిజిక్స్ అధ్యాపకులు ఎస్.రామారావు మాట్లాడారు. ఈ సభలో విఎల్.భానుమూర్తి, ఎఎస్.మూర్తి, డి.గంగా ధరుడు మాట్లాడారు. అనంతరం కళాశాల అటెండర్ కుడకా సత్యనారాయణను కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేనేత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.సునీత మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికుల కుటుంబాల సమస్యలు, పరిష్కారం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ-సామర్లకోట కెనాల్ రోడ్డును పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ వి.భావన అన్నారు. బుధవారం ఉదయం సామర్లకోట కెనాల్ రోడ్డును కమిషనర్ పరిశీలించారు. కెనాల్ రోడ్డులో చెత్త వేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా కాలువ వెంబడి ఏర్పాటు చేయబోయే ఫెన్సింగ్, ప్లాంటేషన్ పనులపై పలు సూచనలు చేశారు. అలాగే పిఆర్ కళాశాల, డిఎంహెచ్ఒ పరిసర ప్రాంతాల్లో డస్ట్‌బిన్ల నిర్వహణ, చెత్త సేకరణ పనులను పరిశీలించారు. వెహికల్ గార్బేజ్ లిఫ్టింగ్ వివరాలను ఎంహెచ్ఒ పృథ్వీచరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

లక్ష్మణస్వామి వర్మ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన అగ్నికుల క్షత్రియ సంఘం వ్యవస్థాపకులు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ సేవలు చిరస్మరణీయమని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. బుధవారం లక్ష్మణస్వామి వర్మ 155 జయంతి వేడుకలు లక్ష్మణస్వామి వర్మ అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు అధ్యక్షతన కోరంగిలో జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి వర్మ సేవలను సేవలను వారు కొనియాడారు. కోరంగిలో లక్ష్మణస్వామి వర్మ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ కాంస్య విగ్రహం ఏర్పాటుకు రూ.1,00,000 విరాళం చెక్కును మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా సంఘానికి అందచేశారు. దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ లక్ష్మణస్వామి వర్మ విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహకారం చేస్తానన్నారు. ఎంఎల్ఎ సుబ్బరాజుతో కలిసి కాంస్య విగ్రహం ఏర్పాటుకు రూ.10 లక్షల వరకూ అందచేస్తామని మల్లాడి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంగాడి రాంబాబు, బర్రె సత్యనారాయణ, మళ్ళాడి ఈశ్వరరావు, దండుప్రోలు నాగబాబు, రాధాకష్ణ పాల్గొన్నారు.



చెక్కును మల్లాడి చేతుల మీదుగా అందిస్తున్న బొడ్డు సత్యనారాయణ

భవిష్యత్‌ను ఉన్నతంగా మార్చుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థులంతా తమ భవి ష్యత్‌ను ఉన్నతంగా మార్చుకునేందుకు కృషి చేయాలని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ ఉప కులపతి, ప్రొఫెసర్ కెవిఎన్‌డి. మురళీకృష్ణ అన్నారు. బుధ వారం జెఎన్‌టియుకె అలూమిని ఆడిటోరియంలో మొదటి ఏడాది బిటెక్, మెడికల్ విద్యార్థులకు 'జాతి నిర్మాణంలో మహిళల యొక్క పాత్ర' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియుకెలో విద్యనభ్యసించిన ఎందరో ఐఎఎస్, ఐపిఎస్‌లుగా, వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని తమ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దు కునేందుకు దృష్టి సారించాలన్నారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి సి.రామ లక్ష్మి జీవితంలో తల్లిదండ్రుల యొక్క ప్రాముఖ్యత, విద్య, క్రీడల యొక్క ఆవశ్యకత, రాజకీయాల్లో యువత బాధ్యత, లింగ వివక్షత, ఎన్నికల్లో మహిళల యొక్క పాత్రను వివరించారు. భారతీయ ఆర్థికాభివృద్ధిలో మహిళల ద్వారా అందే జిడిపి సుమారు 18 శాతం ఉందని తెలిపారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని నిత్య విద్యార్థికి కొత్త విషయాలపై పట్టు సాధించాలన్నారు. ఈ సందర్భంగా రామలక్ష్మిని ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్, రెక్టార్ ప్రొఫెసర్ కెవి.రమణ, ఇఒ అండ్ డబ్ల్యూజి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.స్వరూపా రాణి, యుసిఇకె ప్రిన్సిపల్ ప్రొఫెసర్. ఎన్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ యువి.రత్నకుమారి పాల్గొన్నారు.



అతిథి రామలక్ష్మిని సత్కరిస్తున్న ఇన్‌ఛార్జ్ విసి

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం పట్టణంలోని బంగారమ్మ గుడివీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ గోకేడ అప్పారావు, మాజీ కౌన్సిలర్ గెడ్డం పెదకాపు పాల్గొని మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. అనంతరం వారి చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. అనంతరం సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అమ్మాజీ, ఆయా శ్రీలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తల్లిపాలవరోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కోరంగి పంచాయతీ సీతారాంపురంలోని 15 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తల్లిపాల వారోత్సవాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ మాధవి, సూపర్‌వైజర్లు సత్యనలిని, జిఎంఎస్‌కె.సుజాత పాల్గొన్నారు. **పెదపూడి** మండలంలో పుట్టకొండగరవు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జుత్తుక సూర్యకుమారి, సూపర్‌వైజర్ శ్రీపద్మ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దెయ్యాల నారాయణరావు, స్థానికులు కేత సత్యనారాయణ, గుండు సత్యవతి, మట్ట రాజు, మిరియాల శ్రీను,కేత శ్రీను, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో గర్భిణులకు కిట్లు పింపిణీ చేస్తున్న నాయకులు

డిఎస్‌సి అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన డిఎస్‌సి అభ్యర్థుల కోచింగ్ సెంటర్లో బుధవారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ చేతుల మీగుగా తెలుగు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ బిఎస్‌సి ఉచిత కోచింగ్ తీసుకుని నూటికి నూరు శాతం టీచర్స్ గా ఉద్యోగం సాధించాలని సూచించారు. 512 మంది ఇక్కడ స్టూడెంట్స్ కోచింగ్ తీసుకుంటున్నారని, వీరందరికీ ఉచిత భోజనం, మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, తోలేటి సూర్యనారాయణ, మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.



అభ్యర్థికి మెటీరియల్‌ను అందిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

కార్పొరేట్ వ్యవస్థను తరిమికొట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలో కార్పొరేట్ వ్యవస్థను తరమికొట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అన్నదాన సమాజంలో సిపిఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలులోకి తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షానికి పార్లమెంటులో 240 సీట్ల రావడంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఏర్పడిందన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు శ్వేతపత్రాలతో ధరల భారాన్ని ప్రజలపై రుద్దడానికి సిద్ధం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కిర్ల కృష్ణారావు, తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

బాధ్యతలు స్వీకరించిన పెద్దాపురం సిఐ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సిఐగా టి.క్రాంతికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన రవికుమార్ విఆర్ వెళ్లారు. జిల్లాలోని గొల్లపాలెం, మండపేట, ఐ.పోలవరం, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వర్తించిన క్రాంతి కుమార్ 2023లో సిఐగా పదోన్నతి పొందారు. ఇప్పటి వరకూ జీలుగుమిల్లిలో సిఐగా పనిచేసిన ఆయన బదిలీపై పెద్దాపురం వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.



సిఐ క్రాంతికుమార్

ఎస్ఎంసి కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని 75 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఓటరు జాబితాను సిద్ధం చేశామని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు అందచేసినట్లు చెప్పారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు పాఠశాల యాజమాన్య కమిటీ మెంబర్లను ప్రతి తరగతి నుంచి ముగ్గురు ఎన్నుకుని చివరగా ఎన్నుకోబడిన మెంబర్ల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

9న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు


విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తొలగించేందుకు చేపడుతున్న పనుల కారణంగా ఈ నెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జి.ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గొల్లపాలెం సబ్‌స్టేషన్ 11కెవి ఇండస్ట్రియల్ పరిధిలోని ఆర్యవటం, గొల్లపాలెం, బందనపూడి, మొగలిపాలెం, కొంగోడు ప్రాంతాల్లోనూ, కాజులూరు సబ్‌స్టేషన్ 11 కెవి పరిధిలోని కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, శీల, మేకలగరువు, పల్లిపాలెం ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమలు, అక్వారంగానికి చెందిన వ్యవసాయ కనెక్షన్లకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బిపిఎంకు అవార్డు అందుచేత

ప్రజాశక్తి - రౌతులపూడి

కాకినాడ డివిజన్లో పోస్ట్ ఆఫీస్ ద్వారా వ్యాపారస్తులకు యుపిఐ సేవలు అందించినందుకు కొత్త సునీల్‌కుమార్‌కు పోస్ట్ ఆఫీస్‌లో సూపరింటెండెంట్ శ్రీనివాస్. ఐపిపిబి మేనేజర్ రాజ్‌కుమార్ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌ను ఎం.అప్పారావు, తేజ అభినందించారు.

కార్టూ'నిజం'



లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్యలో చదువుతున్న ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు తగిన కార్యచరణతో ముందుకు సాగాలని ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్స్‌లర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్యలో చేరిన ప్రతీ ఒక్కరికి మీ లక్ష్యం మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం కావాలన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా బిటెక్ పట్టాతోపాటు మంచి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగ నియామక పత్రాన్ని ఆదిత్య అందిస్తుందన్నారు. గత విద్యా సంవత్సరంలో అత్యుతమ వార్షిక వేతనాలు రూ.33.64 లక్షలకు పైబడి ఉద్యోగాలు సాధించిన వారే మీకు ఆదర్శమని అన్నారు. ఆదిత్య యూనివర్సిటీ అందిస్తున్న కోర్సులు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ, వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు, కళాశాలలో గల వివిధ సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్స్‌లర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎంబి.శ్రీనివాస్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దోలా సంజయ్, ప్రో.వైస్ ఛాన్సలర్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, టెక్నికల్ హబ్ సిఇఒ బాబ్జి నీలం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య అధినేత శేషారెడ్డి

పలు ప్రాంతాలు జలమయం



సామర్లకోట బస్టాండులోకి చేరిన మురుగునీరు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ కుండ పోతగా వర్షం కురిసింది. దీంతో కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. పట్టణంలోని రహదారులు బురద మయంగా మారాయి. ఆర్‌టిసి బస్టాండ్ వర్షంతో నీట మునిగింది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అలాగే పట్టణంలోని వెలమ పేట రామాలయం వీధిలోని కాలువల్లో మురుగునీరు ఇళ్లలోకి ప్రవహించింది. డ్రైయిన్లు పూడికతో నిండుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అలాగే స్టేషన్ సెంటర్ వద్దగల రథం షెడ్డు ప్రాంతం వర్షపు నీరు ముంచెత్తింది.

నేరాలు ఘోరాలు

పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేశారు. బుధవారం ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. కమిని పంచాయితీ పరిధిలోని వలసల తిప్ప గ్రామానికి చెందిన వివాహిత భర్త నుంచి విడిపోయి పుట్టింటిలో ఉంటుంది. అదే గ్రామానికి చెందిన ఎలిపే రామకృష్ణ గత కొంతకాలంగా ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటాను అంటూ మాయ మాటలు చెప్పి వెంట పడ్డాడు. గత మే నెలలో తన ఇంటి డాబాపై ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ విషయం తల్లితండ్రులకు చెపితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో ఆమె ఈ విషయం ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టింది. అయితే ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో తల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆమె గర్భిణి అని వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడిని పెళ్లి చేసుకోమని పెద్దల్లో పంచాయతీ నిర్వహించగా రామకృష్ణ పెళ్లికి నిరాకరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సిఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం..

ప్రజాశక్తి - మామిడి కుదురు

పాశర్లపూడిలో రేషన్ బియ్యంను కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు బుధవారం సివిల్ సప్లై అధికారులు రెండు ప్రదేశాల్లో తనిఖీలు చేసి 4529 కేజీల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. తోట సుబ్బారావు కాంప్లెక్స్‌లో 1850 కేజీలు చౌక బియ్యం గుర్తించి కాంప్లెక్స్ యజమాని తోట సుబ్బారావు తోపాటు బియ్యం నిల్వ ఉంచిన బొరుసు మురళీకృష్ణలపై కేసు నమోదు చేశారు. రామా ట్రేడర్స్ నందు 14 బస్తాలలో 2679 కేజీల రేషన్ బియ్యం గుర్తించి యజమాని తోట భవననారాయణపై కేసు నమోదు చేశామని రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్‌వివి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగన్నాథ రెడ్డి, వ్యవసాయాధికారి జయ భార్గవమహేష్, స్థానిక సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

60 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి శివారు ఏలేరు కాలువ వద్ద ఆటోలో తరలిస్తున్న 60 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఆటోలో గంజాయిని తరలిస్తుండగా ఏలేరు కాలువ వద్ద కాపు కాసి ఆటోను తనిఖీ చేయగా దానిలో 60 కేజీల గంజాయిని గుర్తించామని తెలిపారు. గిడజం గ్రామానికి చెందిన తుంపాల సూర్యప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - రాజానగరం

వ్యాన్ టైరు గాలి తగ్గడంతో డ్రైవర్ టైర్ తీస్తుండగా అటుగా వస్తున్న లారీ వేగంగా ఢీ కొనడంతో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ టైర్ గాలి తగ్గడంతో జాతీయ రహదారి కొంతమూరు గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో వ్యాన్ ఆపి డ్రైవర్ ఈడే శివ శంకర్ (38) టైర్ విప్పాడు. ఈలోగా వైజాగ్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఆగి ఉన్న వ్యాన్ ఢీ కొట్టాడు. దీంతో డ్రైవర్ శివశంకర్‌ను ఈడ్చుకుంటూ రహదారి డివైడర్ దాటి అటువైపు వెళ్ళింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నూజివీడు సమీపంలో శోభనా పురానికి చెందిన వాడు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

రెండు కార్లు ఢీకొని ఆరుగురు గాయపడిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం సాయంత్రం నేషనల్ హైవేలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంకు చెందిన చిన్నాబత్తుల సురేష్ కుమార్ అతని భార్య, కుమారుడు, డ్రైవర్‌తో కలిసి అమలాపురం నుంచి కొయ్యలగూడెం వెళుతున్నారు. గోపాలపురంలో మరో కారులో ఒక యువకుడు మరొక ఇద్దరితో వస్తుండగా రెండు కార్లు గోపాలపురం శివారులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు.

పిఠాపురం పెత్తనం 'పెండెం' కేనా...?

- వైసిపికి రాజీనామా చేసిన దొరబాబు
- జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం
- వర్మకు చెక్ పెట్టేందుకు జెఎస్‌పి వ్యూహం?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఆశక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇక్కడ రాజకీయ సమీకరణాలు జోరుగా మారుతున్నాయి. తాజాగా వైసిపి పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు వైసిపికి రాజీనామా చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కూటమితో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. త్వరలోనే ఆయన జనసేన పార్టీ కండువా కప్పుకోనున్నారు. నియోజకవర్గ సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర వైసిపి నాయకులను తన వెంట తీసుకుని వెళ్లి జనసేనలో చేరనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తాను పార్టీకి మాత్రమే రాజీనామా చేశానని, పిఠాపురం ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ సమన్వయం చేసుకుంటానని చెప్పారు. మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు త్వరలో తన అభిప్రాయం తెలియజేస్తానని కూడా వెల్లడించారు. ప్రజలు నియోజకవర్గ అభివృద్ధిని కోరుకుంటున్నందునే తాను పార్టీకి రాజీనామా చేసి కూటమి వైపు చూస్తున్నానని దొరబాబు స్పష్టం చేశారు. అంతే తప్ప రాజకీయం చేయడం, నియోజకవర్గంలో పెత్తనం చేయడం కోసం పార్టీ మారడం లేదని తెలిపారు.

పార్టీ పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం

వైసిపికి రాజీనామా చేసిన పెండెం జనసేనలో చేరడం దాదాపుగా ఖాయం అయినట్లు ఆయన అనుచరులు ఇప్పటికే ప్రచారం సాగిస్తున్నారు. ముహూర్తం కూడా ఫిక్స్ చేసే అవకాశం ఉందని, భారీగా వైసిపి శ్రేణులను సమీకరించి పవన్ సమక్షంలోనే కండువా కప్పుకుంటారని చెబుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టలేకపోతున్నారనే అసంతృప్తి జనసేనానిలో ఉంది. ఈ నేపథ్యంలోనే అనపర్తి నియోజకవర్గంకు చెందిన జనసేన సీనియర్ నాయకుడు మర్రెడ్డి శ్రీనివాస్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అయితే స్థానికంగా జనసేనను పూర్తిస్థాయిలో నడిపించగల తగిన నాయకత్వం లేదనే వాదన ఉంది. నాయకులు ఎక్కువ మందే ఉన్నప్పటికీ వర్గ పోరుతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు ఉన్నాయి. అందు వలనే ఎన్నికలకు 8 నెలల ముందు స్థానిక నాయకత్వాన్ని కాదని ప్రస్తుత కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్‌ను పవన్ కళ్యాణ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. అయితే అనూహ్యంగా పిఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేసి గెలుపొందారు. దీంతో ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను అనుకున్న స్థాయిలో సమన్వయం చేయలేకపోతున్నారనే విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే వ్యక్తం అవుతోంది. సమర్ధవంతంగా పనిచేయలేకపోతున్నారనే అనుమానాలు అధిష్టానం కూడా వ్యక్తం చేస్తుంది. ఇటీవల ఎంఎల్‌సిగా ఎంపికైన పి.హరిప్రసాద్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలనుకున్నా స్థానికంగా అతనికి అంతగా పట్టులేదు. పైగా పవన్ కళ్యాణ్ రాజకీయ వ్యవహారాల్లో ఆయన కీలకంగా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో హరిప్రసాద్ పిఠాపురంకు తగిన సమయం కేటాయించే అవకాశం లేదు. మరో వైపు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబుకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరిగినా కుటుంబ పెత్తనం అనే విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉంటుందని పవన్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 20 ఏళ్ల పైబడి సుదీర్ఘ రాజకీయం అనుభవం ఉండడంతోపాటు, రెండు సార్లు పిఠాపురం ఎంఎల్ఎగా పనిచేసిన దొరబాబును పార్టీలోకి చేర్చుకుని ఆయనకు ఇన్‌ఛార్జ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. మరోవైపు ఇక్కడ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ జనసేన పార్టీకి తలనొప్పిగా మారారు. ఇరు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితులు మారిపోయాయి. ఎటువంటి ప్రోటోకాల్ లేకుండానే వర్మ ప్రభుత్వ కార్యకలాపాల్లో తల దూర్చుతున్నారని జనసేన శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిణామాలతో వర్మకు చెక్ పెట్టేందుకు అధిష్టానం పెండెంకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది.



పిఠాపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు

దొరబాబు వస్తే లుకలుకలు తప్పవా..!

మాజీ ఎంఎల్ఎ పెండెం దొరబాబు జనసేన పార్టీలోకి చేరితే పాత, కొత్త జనసేన నేతలు మధ్య సమన్వయం తలెత్తే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పాత, కొత్త నేతలు అంతా కలిసి ముందుకు సాగాలని పవన్ కళ్యాణ్ పిలుపునిస్తున్నారు. అయితే ఇది నియోజవర్గంలో ఏమేరకు ఫలిస్తుందనేది అనుమానంగా కనిపిస్తోంది. ఇప్పుడు దొరబాబు చేరి ఒకవేళ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు గనుక చేపడితే ఒక వైపు టిడిపితోనూ, రెండోవైపు ఆరంభం నుంచి ఉన్న జనసేన శ్రేణులను సమన్వయం చేసుకుని వెళ్లడం కత్తి మీద సాములా కనిపిస్తుంది. పవన్ కళ్యాణ్ ఆశలు, ఆశయాలకు తగ్గట్టుగా ఇక్కడ పని చేయాలంటే రెండు శిబిరాలు ఏ మేరకు సహకరిస్తాయి, వారిని కలుపుకుని ఏ విధంగా ముందుకు సాగుతారనేది ప్రశ్నార్ధకంగా ఉంది. మొన్నటి వరకు ఎంఎల్ఎగా ఉన్న దొరబాబుపై నియోజకవర్గ వ్యాప్తంగా వర్గ సమస్యలు ఉన్నాయి. ఇప్పుడు సొంత వర్గంతోపాటు అతని వ్యక్తిగతంగా వ్యతిరేకించే వర్గం కూడా తయారయింది. ఈ నేపథ్యంలో పిఠాపురంలో రాజకీయాలను జనసేన ఏ విధంగా ప్రభావితం చేసే అవకాశం ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

యానాం వార్తలు



గవర్నర్‌కు పూలగుచ్ఛాన్ని అందిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నూతనంగా నియమితులైన కునియల్ కైలాసనాథన్‌ను బుధవారం రాజ్ నివాస్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామి, ఇతర మంత్రులు, ఎంఎల్ఎలు ఆయనను కలిసి సత్కరించారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా రుణాలు మంజూరు చేయాలి..

ప్రజాశక్తి - యానాం

ఆదిద్రావిడ శాఖ ద్వారా గత విద్యా సంవత్సరంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న విద్యారుణాలు తక్షణమే మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. యానాం ప్రాంతానికి చెందిన పలువురు ఎస్‌సి విద్యార్థులు విద్యారుణాలకు దరఖాస్తు చేశారు. అయితే విద్యా సంవత్సరం గడిచినా ఆయా రుణాలు మంజూరు కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా రుణాలకు సంబంధించి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉందన్నారు. అయితే గత ఏడాది దరఖాస్తు చేసిన రుణాలు నేటికీ మంజూరు కాలేదన్నారు. రుణాలు మంజూరుపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక దుర్గామల్లేశ్వర ఆలయంలో ఈ నెల 16న శ్రావణ శుక్రవారం సందర్భంగా 2024 మంది ముత్తయిదువులతో వరలక్ష్మీ వ్రత పూజలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహకురాలు కనక విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత 55 సంవత్సరాలుగా తమ ఆలయంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఆలయంలో పండితులు అల్లక్కి రామం శాస్త్రి పర్యవేక్షణలో 2024 మంది ముత్తయిదువులతో ప్రత్యేక పూజలు చేపడతామని తెలిపారు. అలాగే 316 మంది ముత్తయిదువులకు డ్రా పద్ధతిన చీరలు అందించనున్నట్టు చెప్పారు. ఈ వరలక్ష్మి వ్రత పూజల్లో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిర్దేశించిన ధరలకే సరుకుల విక్రయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే సరుకులను విక్రయించాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మోహన్, డిసిపిసి మెంబర్ బి.సూర్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక రిలయన్స్ స్మార్ట్ పాయింట్ సూపర్ మార్కెట్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరలకు ఏర్పాటుచేసిన నిత్యవసర సరుకులు ఫైన్ సోనామసూరి, బిపిటి స్టీమ్ బియ్యం, పచ్చి ఫైన్ సోనామసూరి, దేశవాళీ రకం కందిపప్పును ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. అవసరమైన స్టాకు నిల్వ ఉండేలా చూడాలన్నారు. ధరల పట్టిక కొనుగోలుదారులకు కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఈ ధరలు మూడు వారాల వ్యవధిలో రెండుసార్లు ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

ప్రజాశక్తి - కాకినాడ

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘాను పెట్టినట్లు ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డివిజన్ స్థాయి పిసి, పిఎస్‌డిటి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతోపాటు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఇట్ల కిషోర్

డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 111 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ఇందులో 11 ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉన్నాయన్నారు. ఏప్రిల్ నెల నుంచి జూలై నెల వరకు 2 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 106 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇన్‌ఛార్జ్ డిఐఒ డా.ఆర్.శ్రీనువాస నాయక్, రేడియాలజిస్టు జిజిహెచ్, డాక్టర్ న్యూరిష బేగం, కాకినాడ, పెద్దాపురం, తాళ్ళరేవు సిడిపిఒలు జి.ఉష, ఎ.జ్యోతి, డి.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో బిఎల్‌సి హౌసింగ్ ప్రాజెక్టులో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేందుకు మెప్మా ఆర్‌పిలు లబ్ధిదారులకు అవగాహన పెంచాలని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బేస్‌మెంట్ వరకూ పనులు జరిగేందుకు ఎస్‌హెచ్‌జి, ఎస్-ఎల్ఎఫ్, టిఎల్ఎఫ్‌ల నుంచి ఇప్పటివరకు 636 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ 35 వేలు చొప్పున రుణ సదుపాయం అందజేశామన్నారు. మిగిలిన 1200 మంది లబ్ధిదారులకు అవగాహన పెంచాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఇఇ గుప్తా మాట్లాడుతూ 2025 ఏప్రిల్ వరకూ ఈ పథకం ఉందని, కావున పనులు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహనను పెంపుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఎఇ ప్రసాద్, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, మెప్మా సిఒలు శ్రీదేవి, ఉమాపార్వతి పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక బంగారమ్మ గుడి వీధిలో మరిడమ్మ సంబరం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సంబరంలో ప్రదర్శించిన గరగలు, కాళికా నృత్యాలు, సాము గారిడీలు, జానపద కళారూపాలు, విద్యుత్ దీపాలంకరణ మధ్య ఏర్పాటు చేసిన పురాణ పాత్రల బండ్ల వేశాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బంగారమ్మ గుడి వీధి కమిటీ సభ్యులు సంబరాన్ని పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈనెల 9న ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండలంలో 33/11 కెవి. తాళ్లరేవు సబ్ స్టేషన్, చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో 33/11 కెవి. పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గాడిమొగ, బైరవపాలెం, పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, చొల్లంగి, చొల్లంగిపేట, జి . వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవవల, సాంతమూల గ్రామంలకు విద్యుత్ సరఫరా కు అంతరాయము కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్. ఉదయభాస్కర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రత్నగిరీశా సత్యదేవా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి

ప్రముఖ కవి ర్యాలి ప్రసాద్ అన్నవరం సత్యదేవునిపై రచించిన రత్నగిరీశా సత్యదేవా వచన శతక పుస్తకాన్ని ఆదిత్య విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం పర్వత శ్రేణుల మీద 130 ఏళ్ల క్రితం వెలసిన సత్యనారాయణ స్వామి మహిమాన్వితుడని, రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటిగా అలరారుతున్న ఈ ఆలయ మూలవిరాట్టును గురించి ర్యాలి ప్రసాద్ రచించిన ఈ వచన శతకం భక్తి భావంతో నిండినదని పేర్కొన్నారు. కవి ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ వచనముల ప్రక్రియ ద్వారా రచించిన ఈ శతకం సామాన్య పాఠకులు కూడా చదువుకోవచ్చని అన్నారు.నల్లమిల్లి శేషారెడ్డికి ఒక టి.వి ఛానల్ వారు వివిధ రంగాల్లో సేవలందించిన వారికిచ్చే ప్రతిష్ఠాత్మక బిజినెస్ లీడర్ 2024 - అవార్డు ప్రకటించిన సందర్భంగా ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వడిశెట్టి భాస్కరరెడ్డి, కర్రి వెంకటేష్, కష్ణమోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

దూబగుంట రోశమ్మ 8వ వర్ధంతి

ప్రజాశక్తి - పిఠాపురం



రోశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మండలంలోని భోగా పురంలో బుధవారం సారా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు ధూబగుంట రోశమ్మ 8వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సదర్భంగా మద్యపాన వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకులు వేమగిరి తలుపులయ్య మాట్లాడుతూ యువత ఎక్కువగా మద్యం మాదక ద్రవ్యాలు సేవిస్తూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మద్యం మాదకద్రవ్యాల వల్ల అనేక కుటుంబాలు రోడ్లు పడడంతో వాటికి వ్యతిరేఖంగా రోశమ్మ సాహసం, పోరాట స్ఫూర్తి వెల కట్టలేనిదన్నారు. ఆమె స్ఫూర్తితో మద్యం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సోంబాబు, అబ్బాయి, సూరిబాబు, క్రాంతి కుమార్, జానుబాబు, సురేష్, ఆనంద్, రాజు, పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసన

ప్రజాశక్తి-అయినవిల్లి

ఎస్‌సి వర్గీకరణ తీర్పుపై నిరసనగా, వర్గీకరణ పోరాటంలో నేలకొరిగిన స్వర్గీయ పివి.రావు, మాల మృత వీరులకు ఘన నివాళి అర్పించే 'మాల మత వీరుల సంస్మరణ సభ'కు విద్యార్థులు, యువకులు, సామాజికవాదులు, ఉద్యోగులు, న్యాయవాదులు, అంబేద్కరీయులు, ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాలు పాల్గొనాలని మాల మహానాడు నాయకులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ స్వర్గీయ పివి.రావు ఆశయ సాధనలో భాగంగా యువత 'మరో న్యాయ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మండలం మాల మహానాడు ఆధ్వర్యంలో ముక్తేశ్వరం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

వ్యాధులు దరి చేరకుండా ఉండేందుకు గర్భిణులకు, చిన్నారులకు టీకాలు అందజేస్తున్నట్లు అంగర పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు తెలిపారు. బుధవారం పిహెచ్‌సి పరిధిలోని కపిలేశ్వరపురం -2 విలేజ్ హెల్త్ క్లినిక్ లో భాగమైన దేవి సెంటర్ సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం -4 లో జరిగిన వ్యాధి నిరోధక టీకాల సెషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.